
# లౌ రోగములు

నాయని శేషాచలరావు బి.ఏ




డాక్టరు మాధవరావు విశ్వప్రయత్నాలు చేస న్నాడు లౌ (Love) యొక్క పుట్టుపూర్వో త్తరాలు కనిపెట్టడానికి. అతని వూహాను బట్ట చూస్తే, లౌవనేది టైఫాయిడ్ జ్వరం వంటి రోగమని, టైఫాయిడ్ రోగానికి చిహ్నాము లున్నట్లు లౌ రోగానికి చిహ్నాము లుంటాయని, దానికి వడిదుడుకు లున్నట్లు దీనికి వడిదుడుకు లుంటా యని, కాని టైఫాయిడ్ జ్వరము ఏదో ఒక యిరువదివొక్క రోజులపాటు కాచి చివరకు మనిషిని అటో యిటో తేల్చేస్తుంది కాని 'లౌ' (Love) రోగము మనుష్యునిలో తప్పని సరిగ అంకురించి అతనితో శాశ్వతకాలం పడుంటుం దని తేల్తువున్నవి. ఇంకా అతని అభిప్రాయ మేమిటంటే, పురుషునకుగాని స్త్రీకిగాని వచ్చే ప్రతీరోగమునకు మూలకారణము 'లౌ'

రోగమే ఈరోగము మశూచిరోగమువలె తప్పని సరిగ మనుష్యులకు వచ్చేదే. దీనిని తప్పించుకుని తిరగడానికి బ్రహ్మ, రుద్ర, మహేశ్వరాదులకైన తరముగాదట

'లౌ' డిసీజులో అనేక రకాలున్నాయట. అందులో వొకటి అక్యూటు లౌ టైఫాయిడ్ (Acute Love Typhoid). తార వొంటరిపాటునున్న చంద్రుని జేరి తబ్బిబ్బుపడి, "లోకములోన కొంద ఱబలు ల్సతులం దనియింపక






లేక తాటాకులలోన వ్రాసిరి పరాంగన గూడిన పాపమంచు " అని చెప్పినప్పుడు ఆమె అక్యూటు 'లౌ' టైఫాయిడ్‌లో వుందట. చిత్రాంగి / సారంగధరుని హృదయము పాషాణ హృదయమని యెఱింగియు, ఆగలేక 'కలగిన కొప్పుతో' అతనిమీద విరగబడ్డపుడు ఆవిడ 'లౌ' టైఫాయిడ్ ప్రమదావస్థ యందున్నదట. నాటకరంగమున పురుషులు నాయకపాత్రల ధరించి, ఆరున్నర సృతిలో.—

"ఆగలేనే వేడి కింక అధిక తాపము వేసెనే
రాగమంజరి! ఏమిసేయుదు రోగమెట్టులబోవునే"

అని మృదంగ వాయిద్యానికి అన్వయించేట్టు పాడుతూ అభినయించేటప్పుడు వాడు అక్యూటు లౌ రోగాన్ని నిరూపిస్తున్నాడట. పురుషులు సానుల మరగి సంసారముల మరచి, వారిని "మక్కువ మీఱ గాంచి పలుమారు ఖరంబటు తన్నినన్ సరే, కుక్కయుబోలె వెంట బడి కోడిగ మాడగ భావజార్తిచే " వారిల్లు కనిపెట్టుకుని కూర్చున్నప్పుడు వారు అక్యూటు లౌ రోగంలో తాండవ మాడుతున్నారట ఇక సంసారస్త్రీ అన్నిటికి తెగించి, "ఒల్లను శీల మామగని నొల్లన, కాపుర మొల్ల మానమే నొల్లను చుట్టుపక్కముల నొల్ల గులంబును నొల్ల సామినో " అని మారుమగనిని జూచుకొని స్వాముల వారదృశ్యమైనట్లు అర్ధరాత్రివేళ యింట నుండి అదృశ్యమవడం అక్యూట్ లౌ డిసీజు లక్షణమేనట

'లౌ' టైఫాయిడ్‌లో యింకొక రకముంది. అది మైల్డు లౌ టైఫాయిడ్ (Mild Love Typhoid) ఇది అంత ప్రమాదకరమైనది కాదు. కాని యీరోగము తగలని మనుజుడు లేడు. శ్రీరామనవమి పందిళ్లలో సానిది, "కండ్ల జోళ్ల స్పెటికల్సువాడ క్రాపింగు తల జుట్టు వాడ" అని పాడి గిఱ్ఱున తిరిగి నాట్యమాడుతున్నప్పుడు దాని కొంగు తగిలి ప్రక్కనున్న పురుషుడు పరవశుడై పులకరించడం మైల్డు లౌ టైఫాయిడ్ లక్షణము. సినిమా డాన్సులలో మిస్ సుకుమారీయో మిస్ సుల్తానీయో చెమికీ డ్రెస్సులో ముస్తాబయి, "హంకు ప్యారి, ప్యారి హంకు, ప్యారి క్యారీ, క్యారి ప్యారీ" అని కీచు గొంతుకుతో పాడి, చుంబన మభినయించి, సర్కసు గుఱ్ఱంలాగ ఒక రౌండు తిరిగేటప్పుడు ప్రేక్షకులు పడే వుద్రేకం మైల్డు లౌ డిసీజు లక్షణం. "పులుకుల కబ్బలో కనకపుం గగి దిబ్బలో దాని గు " అనే పద్యాలు చదివేటప్పుడును, "ఆక్కన వ్రాలి కొప్పు విడి యల్లల నాడగ గన్నుదామరల్చక్కగ " అనే వృత్తములు చదివేటప్పుడును పురుషునకుగాని స్త్రీకి గాని మేను చలించి సినిమా మిషనుకు వేడెక్కినట్లు వేడెక్కడము అదొకమాదిరి లౌ లక్షణము. రథోత్సవముల త్రోపుళ్లలో పడాలని పడో ప్రమాదవశముననో ప్రక్కనున్న స్త్రీపై బడి, ఆమెచేత నాలుగుమాట లనిపించుకుని ప్రక్కవారిచేత నాలుగు తిట్లు తిని, వాని నన్ని దులపరించుకుని పురుషుడు తాను "మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబ''ని వుప్పొంగి సంతోషించడం అదికూడ మైల్డు లౌ టైఫాయిడ్ లక్షణమే.

కొన్ని క్రానిక్ 'లౌ' డిసీజు లున్నాయి. తాటిబెంకను చీకిన కొలది నోటికి రుచి తగిలి పరమానందం కలిగినట్లు, కొందరకు సానుల సారం వొంట బట్టినకొలది సంసారములమీద రోత బుట్టి సానులమీద మమత బుట్టి, "సర్వం సమర్పయామి" అని యిండ్లయందున్న చీపుర

పుల్లలతో సహా మార్వారీలవద్ద తాకట్టుపెట్టి సానివాడలను కంట్రాక్టు తీసుకోవడం క్రానిక్ లౌ డిసీజు లక్షణం. పెద్దచదువులకని సీమ దేశాలకు బోయిన కొందరు, ఏంజల్ (angel)ను ఏ మ్యూజియం మూలనో చూచి కలేసుకుని తిరగి, డాన్సులలో మరగి, 'అగడ్తలో బడ్డ పిల్లికి అదే వైకుంఠమని' ఆ 'ఏన్‌జెల్నే' (angel) అంటగట్టుకొని తన్ను మఱచి, తల్లి తండ్రులను మఱచి, తుదకు తనదేశాన్నే మఱచి సీమ దేశాలలోనె హతమారిపోవడం క్రానిక్ లౌ డిసీజు లక్షణమే ఈరోగంలో 'లౌ', రొంటికి పట్టిన గజ్జలాగో లేక గోకిన కొలదీ పంచ ప్రాణాలు వచ్చే ఏనుగు తామరలాగో హృదయాన్ని అంటబెట్టుకుని, రేగినకొలదీ రోగికి వుద్రేకం కలిగించి అతనికి వేసంగిలో కుంపటి ముందు కూర్చున్నంత సౌఖ్యము కలిగిస్తుంది.

కొన్ని లౌ రోగాలు చలిజ్వరాలులాగ హఠాత్తుగా వచ్చి క్వినైను అవసరము లేకుండా పోతవి. మేనకను జూచి విశ్వామిత్రుడు పొందిన రోగము చలిజ్వరమును బోలిన 'లౌ' రోగము. ఇప్పటికాలంలో, మనవాళ్లు ఇంగ్లీషువారి పద్ధతుల ననుసరించిఏబీచిలోనో కలుసుకునిఏసినిమాలోనో తెలుసుకుని ముందు వివాహం చేసుకుని వెంటనే డైవర్సివ్వడం చలిజ్వర 'లౌ' రోగ లక్షణం. ఈరకపు రోగములలో ఒకేరకపు 'లౌ' క్రిములు విస్తారకాలం బ్రతికి వుండలేవు. కాని హరించిన జీవులు హరించినట్లుండక పునర్జీవ మొంది రోగియందు రెమిటింగు ఫీవరు (Remitting fever) లక్షణాలు కనబరచి అతన్ని లెక్కలేనన్ని డైవర్సులపాలుజేయడం మాత్రము తప్పదు

రాత్రిపూట కలవరింతలు, పగటిపూట పలవరింతలు, అప్పుడప్పుడు కూనిరాగాలు, ఎల్లప్పుడు నోటి విజల్ పాటలు యివన్నీ ఇన్‌డైజషన్ 'లౌ' లక్షణాలు. క్రానిక్ 'లౌ' ఇండైజషన్‌లో (chronic Love Indigestion) గ్రుడ్లు త్రిప్పడము, పండ్లుకొఱకడము, మూల్గడము, నీల్గడము చేయి పిసుకుకొనడము మొదలగు లక్షణాలు కనబడుతవి.

కొందరు డాక్టర్లు అప్పుడప్పుడు వింత 'లౌ' రోగాలకు బొల్పడుతూ వుంటూరు. ఇటీవల భాస్కరం అనేవాడు తన భార్యకు కండ్లు కలగగా, ఆమెను డాక్టరు మాధవరావు వద్దకు తీసుకుని వచ్చాడు. డాక్టరు రోగిని ఎడాపెడ జూచి, "కండ్లకు డ్రెసింగు చెయ్యాలి"లని ఆమెను చీకటి గదికి జేర్చాడు. లోపల ఏమయిందో తెలియదు. కాని 'ధాం' అని చప్పుడు మాత్రమైంది. అందరూ గది చేరేటప్పటికి రోగి కండ్లు తుడుచుకుంటూ బైటపడ్డది. డాక్టరు మందు బీరువాల మధ్య పడి లేవడానికి ప్రయత్నిస్తున్నాడు. భాస్కరానికి ఆశ్చర్యమైంది. "డాక్టర్జీ! ఏమిటలా పడ్డా"రన్నాడు. డాక్టరు ఏమని చెబుతాడు. అది దొమ్మరోగ 'లౌ' లక్షణము.